# కథ

'పోనీ మీ రాష్ట్రం తెలుసా? అదీ, అంత పెద్దది సుడిగుండం అంటే' అని విశ్రాంతిగా వెనక్కి వాలాడు నావికుడు.

మళ్ళీ, మద్యం నింపిన గాజుపాత్రని తదేకంగా చూస్తూ మాట్లాడాడు. వాలకం చూస్తే అతడు చెబుతున్నదంతా నిశ్చలంగా వున్న ఆ మద్యంపైన స్పష్టంగా రాసి వున్నట్టుంది. కదిలితే ఆ రాత చెదిరిపోతుందేమోనన్నంత పదిలంగా అతడు ఆ మధుచషకాన్ని పట్టుకున్నాడు. అది మధువా? జ్ఞాపకమా?

అతడు ప్రారంభించాడు.

'కనుచూపు మేరలో యెక్కడా ఘనపదార్థం అంటూ కనిపించని వొక అనంతమైన జలరాశి. నీ మార్గాన నువ్వు పడవలో నేరుగా గమ్యానికేసే పోతున్నట్టు వుంటుంది. వొ రోజంతా గడుస్తుంది. తిరిగి బయలుదేరిన చోటికే వస్తావ్. అయితే నీకా విషయం తెలియదు. యెందుకంటే నీ మార్గం వలయంగా వుందని గుర్తించలేనంత మహా విస్తీర్ణం. అంతా వొక సరళరేఖలా వుంటుంది. సూర్యోదయాల్ని చూస్తావ్. సూర్యాస్తమయాల్ని చూస్తావ్. చంద్రుడు వుదయిస్తాడు. చుక్కలు మొలుస్తాయి. నీ దగ్గర దిక్సూచి లేకపోయినా నువ్వెళ్ళే దిక్కుని సులభంగానే పసిగట్టగలవు. సముద్రయానంలో ఆరితేరిన మహామహుల్ని సైతం తప్పుదోవ పట్టించే మబ్బులు నీ చంద్రుడికీ, చుక్కలికీ అడ్డం వస్తే నువ్వు చేసేదేమీ లేదు. పగటిపూట సూర్యుడు మాత్రమే నీ దిక్సూచి. అయినా నువ్వు బయలుదేరిన చోటికే తిరిగి వొచ్చినప్పుడు నువ్వు నీ మార్గాన్ని యేమాత్రం అనుమానించవు. అంతా సక్రమంగానే వుందనుకుంటావు. సూర్యోదయం జరిగినచోటే సూర్యాస్తమయం కావడాన్ని వొక వింతగా భావిస్తావు. కన్యాకుమారి నుంచి ప్రతి ప్రాణీ చూసేదాన్నే నువ్వూ చూసినట్టు భ్రమపడతావు. కానీ జరిగింది అది కాదు. నువ్వు అప్పటికే సుడిగుండంలోని మొదటి వలయాన్ని చుట్టి రెండో వలయంలోకి వెళ్ళిపోయావు. యీసారి కూడా నువ్వు సూర్యుడు వుదయించిన చోటనే అస్తమించడం చూస్తావు. అది యీ సముద్రపు అనంతకోటి లీలావిశేషాల్లో వొకటని కొట్టిపారేస్తావు. అట్లా నువ్వు నీకు తెలీకుండా రోజు రోజుకీ సుడిగుండంలో లోపలికి ప్రయాణిస్తూ వుంటావు. అగాధమైన అంతులేని దూరాన్ని నిరీక్షణతో కొలుస్తూ వుంటావు. బహుశా వొక పక్షం రోజులకి నువ్వు ప్రయాణించే పడవ అమితమైన వేగాన్ని అందుకుంటుంది. నీ చుక్కానికి అర్థం లేకుండాపోతుంది. లంగరు హాస్యాస్పదంగా గలగలమంటుంది. సముద్రంలో నీటి ప్రవాహాన్ని చూస్తావు. అది గుండ్రంగా తిరగడం గమనిస్తావు. భయంతో, ప్రాణభయంతో అవులిస్తావు. సముద్రం నోరు తెరిచి నిన్ను పిలవడం చూస్తావు. యిక యేమాత్రం ఆలస్యం కాకుండా ఆ రహస్యమైన పిలుపును అందుకున్న దానిలాగా నీ పడవ శబ్దవేగంతో సుళ్ళు తిరుగుతుంది. అప్పడే నీకు జ్ఞానోదయం కలుగుతుంది. సముద్రానికి సంబంధించిన నీ పరిజ్ఞానం వొక్కసారిగా నీకు రక్షణగా నిలుస్తుంది. ప్రాణం కూడగట్టుకుని సుడిగుండంలో నుంచి తప్పుకోవాలని విఫలప్రయత్నం చేస్తావు. అయితే పదులా, వందలా– వేల కిలోమీటర్ల వేగంతో పడవను వెనక్కి నడపడం యెవరికి సాధ్యం? నీ పడవ వొక బ్రహ్మాండమైన పద్మం మీద రహస్య ఆకర్షణకు గురై వాలిన తుమ్మెదలాగా కనిపిస్తుంది. ఆ పద్మం అనంతమైన వేగంతో సముద్ర గర్భంలోకి గిర్రున తిరుగుతూ వుంటుంది. దాని వడిబొడ్డు చేరుకునేసరికి పడవ వొక్కసారి పైకి యెగిరి వొక విమానంలాగా ఆ మహాపద్మం తూడుగుండా సముద్రపు అట్టడుగుకి దూసుకుపోతుంది. దానికి అప్పుడు వొక తిమింగిలం అడ్డు వొచ్చినా దాని కడుపు చీలికలు కావల్సిందే. అట్లా సుడిగుండంలో నీ ప్రయాణం ఆఖరవుతుంది'– అని చెప్పడం ఆపి మద్యాన్ని వొక్క గుటకతో ఆఖరుచేసేశాడు నావికుడు.

నేను నిర్లిప్తంగా అతడికేసి చూస్తూ వుండిపోయాను.

'నువ్వెప్పడయినా సుడిగుండాన్ని చూశావా'? అని అడిగాను.

అతడు భళ్ళున నవ్వాడు.

'బహుశా సముద్రం కన్నబిడ్డ కూడా దీనికి జవాబు చెప్పలేడు. సుడిగుండాన్ని చూడటం అంటేనే అందులో వున్నావని అర్థం. కానీ వొక్కసారి, వొకే వొక్కసారి నా ప్రాణాల్ని రక్షించుకోగలిగినంత దూరంగా నేను సుడిగుండాన్ని చూశాను. అప్పటికే ఆ వలయంలో ప్రయాణిస్తున్న వొక స్టీమరులోని జనసందోహం తుళ్ళింతలు, కేరింతలతో వుండడం చూసి నాకు వొళ్ళు జలదరించింది. అది సరళరేఖా? లేక సర్పిలమా? అది ఆనందమా, విషాదమా? వాళ్ళకు చెప్పేదెవరు? మృత్యువుకు తల యిచ్చి ఆ స్టీమర్‌ను సమీపించి వాళ్ళు సుడిగుండపు తొలి వలయంలో వున్నారని చెప్పగలిగే మానవాతీతుడు యెవరు? వాళ్ళ ప్రయాణం యెంత దారుణంగా ముగుస్తుందో నాకు అర్థమవుతూనే వుంది. నేనేం చేయగలను? ఆ పరివలయపు నిగూఢ ఆకర్షణ నుంచి నా పడవను నేను వెనక్కి మళ్ళించడమే ప్రళయమైపోయింది. చివరికి వొక పెద్ద షార్క్‌కి నేను విసిరిన యీటె నా పడవను యువతలికి గుంజింది. యీటె తాడు సాయంతో నా పడవ దూర దూరంగా రక్షణ జలాన్ని చేరింది. అందుకు కృతజ్ఞతగా మా సహచర బృందం ఆ షార్క్‌మీద మరో యీటె నాటకుండా తొల యీటెను తాడుతోసహా ఆ జలచరానికి కానుకగా వదిలిపెట్టేశాం'– అతను చెప్పడం ఆపాడు.

'మరి తుపాను సంగతి'? దీనికి కూడా పైదానిలాగే సమాధానం ప్రారంభమవుతుందనుకోవడంతో నా ప్రశ్న ధాటీగా లేదు.

అతను చిన్నగా నవ్వి కళ్ళు మూసుకున్నాడు. 'మీరిప్పడు తుపానును చూస్తున్నారనుకుంటాను' అని వొక చౌకబారు మాట వదిలాను.

'అది నా లోపలే వుంది. యెందుకంటే తుపాను సుడిగుండం లాంటిది కాదు. సుడిగుండానికి మనం యెంత దూరంగా వుండాలో తుపానును అంత లోపలికి తెచ్చుకోవాలి. అది నిన్ను, నీ పాత నిన్ను వూడ్చివేస్తుంది. నిజానికి తుపాను విశ్వసుందరి తమోకేశరాశి విసిరే ఝంఝూమారుతం మాత్రమే. వృద్ధులు ప్రాణాలు పోగొట్టుకుంటారు. జ్ఞానులైన యువకులు ఆమెను ఆలింగనం చేసుకుంటారు.

నువ్వు మిట్టమధ్యాహ్నం తళుకుమనే అద్దంమీద నీ పడవలో ప్రయాణిస్తూ వుంటావు. వున్నట్టుండి నీ ముందు సూర్యుడు మాయమయిపోతాడు. ఆకాశాన్నంటే వొక నల్లటి గోడ నిలుస్తుంది. నువ్వు అది యేమిటో తెలుసుకునేలోగానే గాఢాంధకారంలో మునిగిపోతావు. బలహీనుడివైతే నువ్వు గడ్డకట్టి చస్తావు. లేదా సుమశీతలమైన విశ్వమోహిని అలక రాశిలో సొమ్మసిల్లుతావు. నీ శరీరం పులకాంకితమై నువు తేరుకున్న మరుక్షణమే నీ యెట్టయెదుట మెరుస్తున్న, కరుగుతున్న, మరుగుతున్న వొక కొత్త అద్దాన్ని చూస్తావు. అందులో సూర్యుడి ప్రతిబింబాన్ని కూడా చూస్తావు. కానీ అప్పడే ఆశ్చర్యకరంగా నీ వెనక సూర్యాస్తమయం కావడం చూస్తావు. అంతా కారునలుపు. నీ ముందు సూర్యోదయం, నీ వెనక సూర్యాస్తమయం యేక కాలంలో అన్నమాట. అప్పడు తెలుసుకుంటావు వొక తుపాను నీ మీదుగా వెనక్కు వెళ్ళిందని. ఆశ్చర్యంతో, వాత్సల్యంతో నువ్వు నీ వెనక సుదూరంగా కనిపించే నల్లటి మచ్చని చూస్తావ్. అయితే,' అని అతడు బేరర్ని పిలవబోయాడు. కానీ అప్పటికే ఆ యిరుకు హోటల్ గదిలోని జనం అంతా మన నావికుడి చుట్టూ చేరిపోయారు. అతని పాత్రని యెవరో మద్యంలో నింపారు. యీ గౌరవానికి అతడి ముసలి గడ్డం చిరునవ్వుతో వికసించింది.

'యింకా చెప్పండి, మీ ప్రేయసి గురించి...'

'మీ తుపాను గురించి...'

చాలా గొంతులు వినమ్రంగా అడిగాయి.

'తుపాను ప్రేయసి యెట్లా అవుతుంది? అది ప్రాణాలు తీసేది' అన్నారొకరు.

'సరైన మగాడికి అది ప్రేయసి' అని అతడు గంభీరంగా వుండిపోయాడు.

'తుపాను మీ ప్రేయసి అయితే మరి సుడిగుండం'? అని యెవరో తెలివి కనబరచారు.

'అది నా శత్రువు', అని అతడు భీకరంగా జవాబిచ్చాడు. అతడి కళ్ళల్లో కనిపించిన క్రోధాగ్నికి మండిపోతామేమో అన్నట్టుగా దగ్గరగా మూగినవాళ్ళంతా వొక్కసారిగా వెనక్కి పడ్డారు.

'అయితే నీ శత్రువు బారి నుంచి నీ కళ్ళముందే అంతం కాబోతున్న నౌకలోని ప్రయాణీకుల్ని యెందుకు రక్షించలేకపోయావ్' అని వొక యువకుడు నిలవేశాడు.

నావికుడు దిగులు ముఖం పెట్టి తల వంచుకున్నాడు.

'నాకు అంత శక్తి లేదు. అంతటి జ్ఞానమూ లేదు. అర్థశతాబ్దపు నా అనుభవం కూడా నా వృద్ధాప్యం ముందు పనికిరానిదైపోయింది. నేను వృద్ధుడిని. సముద్రం మీదనే కాదు యీ భూమి మీద కూడా యెన్నో సుడిగుండాలను చూస్తున్నాను నేను. మానవులు తాము ముందుకే ప్రయాణిస్తున్నామనుకుంటూ బ్రహ్మాండమైన భూమిమీది సుడిగుండంలో రకరకాల వలయాలలో తిరుగుతుండడం చూస్తున్నాను. సముద్రపు సుడిగుండాలను నేను సమీపించలేకపోయినా యీ భూమి మీది సుడిగుండాలను దాటడం నాకు చేతనవును. కానీ యెవరికైనా యేదైనా చెప్పడానికి నేనెవర్ని? నన్ను ప్రశ్నించిన యువకుడా, నువ్వైనా యీ సుడిగుండాలేమిటో చూసి గుర్తించగలవా? యెదురీది బయటపడగలవా?' అని నావికుడు గంభీరంగా, వాత్సల్యంగా అడిగాడు.

యెవరి నోటా మాటలేదు.

